

1లో..

## మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై కేసు

- సుబేదారి పీఎస్ లో భూకబ్జా కేసు నమోదు
- 500 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు ఆరోపణలు
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 62
పేజీలు : 08 | వెల: రూ.5/-

గురువారం
నవంబర్ 21, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# డైలాగ్ వార్..



## తరం మారుతోంది.. స్వరం మారుతోంది

హద్దులు దాటుతున్న రాజకీయం

అధికారం కోసం గడ్డి కరుస్తున్న నేతలు

విమర్శలు, ప్రతివిమర్శలతో హంగామా

ఉపయోగంలోకి వాడలేని పదాలు, రాయలేని భాష



వివరాలు2లో..

రాజకీయమంటే అర్థం మారిపోయింది. అధికారం కోసం నానాగడ్డి తినేందుకు నేతలు వెనకాడడంలేదు. కేవలం విమర్శలే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నారు. పరస్పర విమర్శల్లో పడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పక్కన పెడుతున్నాయి. ఇందుకు అటు అధికార పార్టీ.. ఇటు విపక్ష పార్టీలు తక్కువేం తినలేదు. ఎంత తీవ్రంగా తిట్టి పోసుకుంటే అంత గట్టిగా రాజకీయాలు చేస్తున్నామని భావిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో రాజకీయాలు భ్రష్టు పడుతున్నాయి. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ అవి హద్దులు దాటడమే ఆందోళన కలిగిస్తోంది. నేతలు హుందాతనం కోల్పోతున్నారు. భాషను ఎలా వాడుకోవాలో తెలియడం లేదు. హద్దులు దాటి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. వాడలేని పదాలను వాడుతున్నారు. రాయలేని భాషలో మాట్లాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తొందరలోనే రాజకీయాలు అంటే రోతపుట్టే పరిస్థితి ఏర్పడుతుందని సీనియర్ పొలిటీషియన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు నియంత్రణ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. విమర్శలు, ప్రతివిమర్శలకు పోకుండా ప్రజల అవసరాలను గుర్తెరిగి పనిచేసేందుకు రాజకీయ నాయకులు ముందుకు రావాలంటున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి



8లో..

## ఏసీబీకి చిక్కిన అధికారిణి

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ డ్రాఫ్ట్ మెన్
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



8లో..

## మహిళల భద్రత, రక్షణకు ప్రాధాన్యం

- దేశ ప్రగతి మహిళా సాధికారతతోనే సాధ్యం
- మంత్రి సీతక్క, ఎంపీ డా. కడియం కావ్య



2లో..

## పోలీసులు ప్రజా సేవకు అంకితం కావాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



8లో..

## రామప్పలో కేంద్ర సహాయ మంత్రి

- దేవాలయంలో రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన పూజారులు

# డైలాగ్ వార్..

- తరం మారుతోంది..స్వరం మారుతోంది
- హద్దులు దాటుతున్న రాజకీయం
- అధికారం కోసం గడ్డి కరుస్తున్న నేతలు
- విమర్శలు, ప్రతివిమర్శలతో హంగామా
- ఉపయోగంలోకి వాడలేని పదాలు, రాయలేని భాష



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** రాజకీయాల్లో గతంలో దాడులు, ప్రతిదాడులు పెద్దగా కనిపించేవి కావు. అడపాదడపా క్షేత్రస్థాయిలో స్వల్ప ఘటనలు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. అధికార పార్టీ, విపక్ష పార్టీ అన్న తేడా లేకుండా దాడులకు, ప్రతిదాడులకు తెగబడు తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకూ ఓ హద్దు ఉండాలన్న ఇంగితాన్ని మరచి నేతలు ప్రవర్తిస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినా అవి కూడా హద్దులు దాటుతున్నాయి. వాడరాని భాష వాడుతున్నారు. రాయరాని భాషలో మాట్లాడుతున్నారు. ఎత్తులు పై ఎత్తులు వేయడం అవసరమే కానీ అలవికాని భాషలో విమర్శలతో దాడులు చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయడంలేదు. ఎదుటి వారి ఆస్తులపైనా, కుటుంబ సభ్యులపైనా దాడులు చేసే స్థితికి నేతలు దిగజారిపోయారు. ఎదుటివారు ఎంతగా రెచ్చగొట్టేలా చేసినా.. అంతకు పదింతలుగా అలాంటి పంథానే ఎన్నుకుంటున్నారు. అయితే దాడులతో కట్టడి చేయాలనుకోవడం సరికాదు. నేతలు సంయమనం పాటిస్తూ హుందాతనంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

## డైలాగ్ వార్..

తాజాగా హైడ్రా, మూసీ సుందరీకరణ, లగచర్ల తదితర విషయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. అయితే ఈ డైలాగ్ వార్ కాస్త దాడులకు దారితీస్తోంది. దీంతో రాజకీయాలు శృతి తప్పుతున్నాయి. హద్దులు మీరుతున్నాయి. దాడులకు నేతలు తెగబడుతున్నారు. ఇది ఫ్యాక్షన్ తరహా రాజకీయం తప్ప మరోటి కాదు. వాంఛనీయం అస్సలు కాదు. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పాలి. లేకుంటే ప్రజలు అయినా ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. తెలంగాణలో ఏక్‌నాథ్ షిండే మాడల్ రాజకీయాలు చేస్తున్నారంటూ బీజేపీపై విమర్శలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. ఆయన పదవి ఊడిపోతుందంటూ నిరాదార ఆరోపణలు చేస్తున్నారు.

## అడ్డుకోవాల్సిందే..

లగచర్ల విషయంలో సామాన్యులకు నష్టం జరిగితే అడ్డుకోవాల్సిందే. విమర్శలను ప్రజలు ఆలోచించే విధంగా చేయాలి. నిజాలు ఉంటేనే మాట్లాడాలి. ఎలాంటి సంస్కార హీనత సరికాదు. గతంలో మల్లన్న సాగర్ విషయంలో నిరంకుశంగా వ్యవహరించి, రైతులపై కేసులు పెట్టిన బీఆర్ఎస్ ఇప్పుడు సుద్దపూసలెక్క మాట్లాడుతున్నారు. ఫార్మాసిటీ పేరుతో బలవంతంగా భూములు లాక్కున్న కేటీఆర్ ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు. అయితే ఎప్పుడైనా, ఎక్కడైనా భూసేకరణ మాత్రం బలవంతంగా సాగరాదు. సామాన్య ప్రజలకు నష్టం జరగకుండా అడ్డుకోవాల్సిందే. సమస్యలను పెద్దవి చేసిచూపుతూ ..మొత్తంగా రాజకీయాల్లో హింసను జొప్పిస్తున్నారు. ఎవరిది పైచేయి అనేకన్నా అనేక సందర్భాల్లో అధికార పార్టీకి పోలీసులు వత్తాసుగా మారారు. దాడులకు తెగబడుతున్నా చూసీచూడనట్లుగా మిన్నకుంటున్నారు. లగచర్ల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి. బలవంతపు భూసేకరణ మాత్రం సరికాదు.



## పునరాలోచన చేయాలి..

రాష్ట్రంలో అనాగరిక పాలన సాగుతోందని, ఏహోదా లేని సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి డిఫాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఇక్కడి అరాచక పాలనపై ప్రధాని మోదీ సహా రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించటం లేదంటూ కేటీఆర్ నిలదీస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ ఉన్నప్పుడు కూడా ఇలాంటి డిమాండ్‌లే వచ్చాయి. మరి ఆనాటి పాలనపైనా విచారణకు ఆదేశిస్తే మంచిదే. అమాయక పేదల పక్షాన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నిలపడాలి. గిరిజనులపై పోలీసులే లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీఆర్ఎస్ చేస్తున్న విమర్శల్లో నిజాలను వెలికి తీయాలి. ఇప్పటికైనా కేంద్రానికి మనసుంటే ఈ ఘటనపై వెంటనే విచారణ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సరార్ చేసిన అఘాయిత్యాలపై బాధితులు మానవ హకుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్‌ను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్ల ద్వారా న్యాయం జరుగుతుందని, దాష్టికానికి పాల్పడిన పోలీసులకు నోటీసులు ఇస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. లగచర్ల ఘటనను దేశ ప్రజాస్వామ్యం దృష్టికి తెస్తం.. రాజ్యసభలో మా ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో వివరించి తెలంగాణలో రేవంత్ బండారాన్ని ఎండగడుతాం అని స్పష్టం చేశారు. అయితే సమస్యలను దృష్టికి తెచ్చే క్రమంలో ఎలాంటి అలజడులు, పరస్పర నిందా రోపణలు సరికాదు. రాజకీయాల్లో మంచి వాతావరణం కోసం అందరూ కృషి చేయాలి.

# మహిళల భద్రత, రక్షణకు ప్రాధాన్యం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్న కాంగ్రెస్ రాష్ట్ర సర్కారు, భద్రత, రక్షణకూ అధిక ప్రాధాన్యమిస్తున్నదని మంత్రి సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం ఖిలా వరంగల్, మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో ట్రెయినీ మహిళా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకుని విధులకు హాజరవుతున్న సందర్భంగా వారికి ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతలు ఎక్కడైతే పటిష్టంగా ఉంటాయో.. ఆ ప్రాంతం బాగుపడుతుందని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల భద్రతకు షీటీంలు ఉన్నాయని, అన్ని జిల్లాల్లోను ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయని వాటి ద్వారా మహిళలకు భరోసా కల్పించడం జరుగుతుందని తెలిపారు. దేశ ప్రగతి మహిళా సాధికారత మీద ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోజు కానిస్టేబుళ్ల పరేడ్ ఎంతో కన్నుల విందుగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గానే కాదు ఒక డాక్టర్ గా మహిళా కానిస్టేబుళ్లు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఫిజికల్ గా మెంటల్ గా ఫిట్ గా ఉండాలని సూచించారు. ఒక మగాడు చదువుకుంటే అతడు మాత్రమే బాగుపడతాడు, ఒక మహిళ చదువుకుంటే కుటుంబం బాగుపడుతుంది అనేది అక్షరాల నిజంమన్నారు. విధి నిర్వహణలో చిన్నారులు, వృద్ధులు ముఖ్యంగా మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ, ప్రేమను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఈస్ట్ జోన్ రవీందర్, పీటీసీ ప్రిన్సిపల్ పూజ ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.









# తోరాకోస్కోపిక్ సర్జరీ విజయవంతం

### మెడికవర్ హాస్పిటల్ వైద్యుల వెల్లడి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని హంటర్ రోడ్డు మెడికవర్ హాస్పిటల్ లో తోరాకోస్కోపిక్ ( వాట్స్) సర్జరీ చికిత్సను విజయవంతం చేయడం జరిగిందని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. గురువారం హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ పేషెంట్ కలీం ఖాన్, వయస్సు 53 సంవత్సరాలు, భూపాలపల్లి జిల్లాకి చెందిన కలీం ఖాన్ కు ఛాతి ప్రత్యక్షంగా ఊపిరితిత్తులు, ప్లూరా చాతి కుహరాన్ని కప్పి ఉంచే పొరతో బాధపడుతున్న సందర్భంలో ఈ నెల 2న మా మెడికవర్ వైద్య బృందం తోరాకోస్కోపిక్ సర్జరీని సక్సెస్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల చుట్టూ చీము, నీరు లాంటివి గడ్డ కట్టినప్పుడు తోరాకోస్కోపిక్ (వాట్స్) సర్జరీ చేయడం జరుగుతుందని తెలిపారు. సర్జరీకి ఉపయోగించే అతి తక్కువ ఇన్వాసివ్ సర్జికల్ టెక్నిక్, (వాట్స్ )అనేది ఛాతిలో చిన్న కోతలు చేయడం, పెద్ద కోతలు, లేదా పక్క టెముకల వ్యాప్తి అవసరం లేకుండా శాస్త్ర చికిత్స విధానాలను నిర్వహించడానికి ప్రత్యేకమైన కెమెరాలను, టెక్నాలజీ తో కూడిన పరికరాలను ఉపయోగించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పుడు పెషేంట్ ఆరోగ్యంతో ఉన్నాడని తెలిపారు. అనంతరం డాక్టర్లకు కలీం ఖాన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్లాడి సృజన్ (కార్డియో తోరాసిక్ వాసిక్లర్ సర్జన్), డాక్టర్ పూర్ణచంద్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, సెంటర్ హెడ్ నమ్రత, మార్కెటింగ్ ఏజీఎం అర్షద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, నవంబర్ 21, 2024

# బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

## ➲ 26న కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలో మూడోసారి అధికారానికి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. హనుమకొండ రాంనగర్ లోని సుందరయ్య భవన్ లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ఎం చుక్కయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యంఎస్ రావు పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్రాన్ని స్వావలంబనను తాకట్టు పెడుతున్నదన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిల పడుతుందన్నారు. మన జాతీయ వనరులు సంపదలను లూటీ చేస్తుందని, నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించడానికి వంద రోజులు లక్ష్యాన్ని నిర్దేశించుకుందని వారు విమర్శించారు. లేబర్ కోడ్ లను నోటిఫై చేయడం, భారతీయ న్యాయ సంహిత 2023 (బీఎంఎస్)లను అమలు చేయడం నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ ద్వారా కార్పొరేట్ పెట్టుబడుదారుల బడా వ్యాపారస్తులకు ఆర్థిక వెసులుబాట్లను కల్పించే చర్యలను వేగవంతం చేసిందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ వినాశకర చర్యలను కార్మిక వర్గం రైతాంగం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను సవరించాలని, 73వ షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ విధానాలను నిరసిస్తూ నవంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు గ్రామాలు మండలాల్లో కరపత్ర ప్రచారం నిర్వహించాలని నవంబర్ 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ఏఐఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవ రెడ్డి, యూటీయూసీ జిల్లా నాయకులు కే శివాజీ, నాయకులు బరుపట్ల మహేష్, మంద మల్లేశం, కారు ఉపేందర్ లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ కు నిధులు

## మేయర్ కు అభినందనలు తెలిపిన కాంట్రాక్టర్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ సివిల్ కాంట్రాక్టర్స్ నూతనంగా జీడబ్ల్యూఎంసీ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్న సందర్భంగా కార్యవర్గం సభ్యులు గురువారం వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కు నిధులు తెప్పించినందున అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం అధ్యక్షుడు పూజారి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కే.సుధాకర్, ఉపాధ్యక్షులు మేకల రమేష్, దూకుడు సోమయ్య, సిలువేరు కోటేశ్వర్, బొంత సోమయ్య, ఒర్సు ఎల్లయ్య, ఒర్సు మల్లయ్య, చీఫ్ అడ్వైజర్ గోల్కొండ సాంబయ్య, జనరల్ సెక్రటరీ మిట్టపల్లి రాజేందర్, కోశాధికారి సీహెచ్ మధుసూదన్ పాల్గొన్నారు.

# మంజుల దేవికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఇంగ్లీష్ విభాగ పరిశోధకురాలు బి.మంజుల దేవికి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ బి.మంజుల దేవి "sahitya akademi award winning novels : a thematic study of select english novels"అనే అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే పురుషోత్తం పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టర్ బి. మంజుల దేవిని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ టోర్నమెంట్ (పురుషుల) విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో నవంబర్ 22, 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు, ప్రారంభ సమావేశం నవంబర్ 22 ఉదయం 10.00 గంటలకు వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి పాల్గొని ప్రారంభిస్తారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీకి సన్మానం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా తౌటం ఝాన్సీ రాణి–రవీందర్ దంపతులను అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని చైర్మన్ ఝాన్సీ రాణి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించి మార్కండేయుడి ఫొటోను బహుమానంగా అందజేశారు. అనంతరం స్వీట్లు అందజేసిచేసి చైర్ పర్సన్ గా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తౌటం ఝాన్సీ రాణి–రవీందర్ మాట్లాడుతూ 35 ఏళ్ల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవిని అప్పగించిందని, చైర్మన్ పదవికి సహకరించిన మంత్రులకు, కాంగ్రెస్ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా, సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ మరో రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు, ఇతర ఎన్నికలు జరిపే ఛాన్స్ ఉన్నందున పద్మశాలి ముద్దుబిడ్డలు అవకాశం ఉన్న ప్రతి చోట వార్డు మెంబర్ మొదలుకొని, సర్పంచ్, ఎంపీటీసీ, ఇతర పదవులకు కచ్చితంగా బరిలో నిలిచి పద్మశాలీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. పోటీ చేసే ప్రతి పద్మశాలి బిడ్డకు కులం అండదండలు ఎల్లవేళలా ఉంటాయని, వారి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ ఆదివారం నిర్వహించే కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకన్న, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు పోరండ్ల రమేష్, నల్ల సత్యం, వెంగళ వేణుగోపాల్, యూత్ కమిటీ అధ్యక్షుడు పోరండ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, సత్తూరి సంతోష్, గైని సత్యనారాయణ, కుసుమ శ్యాంసుందర్, తుమ్మ రమేష్, మార్గం ఎల్లయ్య, గోలి రవి, సాదుల రాజలింగం, ఆడెపు విశ్వనాథ్, చేరాల చంద్రమోహన్, కుల బాంధవులు పాల్గొన్నారు.

# రామచంద్రు నాయక్ చేసిన వ్యాఖ్యలు సరికాదు

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో మహా ధర్నాకు పెట్టామని భారత జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు పోలీసులపై ఒత్తిడి చేయడంతోనే పోలీసులు మహాధర్నాకు అనుమతిని నిరాకరించారని ఆరోపించారు. మహా ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తే రాళ్లతో కొట్టాలని ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ పిలుపునివ్వడం సిగ్గుచేటని, రామచంద్రు నాయక్ చేసిన వ్యాఖ్యలను పోలీసులు సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ లో రాజ్యాంగాన్ని కాపాడాలని అంటున్నారు. అదే రాజ్యాంగబద్ధంగా మేము అడుగుతున్నామని, ఇందిరమ్మ రాజ్యం ఎటు పోయిందని ప్రశ్నించారు. లగచర్లలో అకారణంగా అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మహాధర్నాకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దుర్మార్గమని, కోర్టు అనుమతులతో మహబూబాబాద్ లో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి కేటీఆర్ ను తీసుకువచ్చి మహాధర్నాను నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. లగుచర్ల గిరిజనులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే లు శంకర్ నాయక్, రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

# గాదె భాస్కర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త, యువ నాయకుడు గాదె భాస్కర్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన స్నేహితులు సమిష్టిగా అందరూ కలిసి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి మాజీ జడ్పీటీసీ జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్నికార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన స్నేహితులు రాంబాబు మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి చిన్నతనం నుంచి స్నేహితులంటే ఎంతో ఇష్టమని, స్నేహానికి ప్రతిరూపం ఆయన అన్నారు. భాస్కర్ రెడ్డి అది చిన్న వయసులోనే మరణించడం చాలా విషాదకర విషయమన్నారు.. భాస్కర్ రెడ్డి ఆశయ సాధన కోసం స్నేహితులు ముందుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి స్నేహితులు ఆకుల మహేష్, గాదే మహేందర్ రెడ్డి, లోనే శ్రవణ్ కుమార్, కోళ్ల రవి గౌడ్, మల్కాపురం అన్వేష్ గౌడ్, రంగు రాజు గౌడ్, కోళ్ల సాయికుమార్ గౌడ్, గోరిగే రవి, మహమ్మద్ రహీం పాల్గొన్నారు.

# డిసెంబర్ లో గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలలో గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు డిసెంబర్ మాసంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా తరగతులకు హాజరుకావడానికి ఆసక్తి గల గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు తమ పేర్లను సంబంధిత జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయాలలో నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

## తహసీల్దార్ సత్యనారాయణ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** విద్యతో పాటు క్రీడలో రాణించాలని సత్యనారాయణ అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ మండల స్థాయిలో నిర్వహించారు. ఈ పరీక్షకు మండంలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాల 8 , 9, 10వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దకోడెపాక, ప్రైవేటు పాఠశాలల విభాగంలో నవోదయ హైస్కూల్ శాయంపేట, రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో ఎంజేపీఆర్ఎస్ శాయంపేట వారు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ ఫణిచంద్ర, మండల విద్యాధికారి భిక్షపతి, బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రావు, జన విజ్ఞాన వేదిక జిల్లా విద్యా విభాగ కన్వీనర్ భిక్షపతి పాల్గొన్నారు. ఇందులో భాగంగానే శ్రీ శంకర నారాయణ విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు మూఢనమ్మకాల వలన కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు.

# టెంట్ సామాన్ల బహుకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులకు దాతలు టెంట్ సామాన్లను బహుకరించారు. 54 డివిజన్ లోని హనుమాన్ నగర్ లోని దాసాంజనేయస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సంరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అయితే ఆ ఏడాది కూడా అన్నదానం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ క్రమంలో టెంట్ సామాన్ల బయటి నుంచి రెంట్ తెచ్చుకోవడాన్ని గమనించిన గుంటి కమలాకర్, గుంటి మురళి, దుంపల మధు, నీలం లక్ష్మణ్, దుంపల కృష్ణ అయ్యప్ప మాలధారుల అన్నదానం కోసం వంట చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా వంట గిన్నెలు, టెంట్ సామాను బహుకరించడం జరిగింది. అయ్యప్ప దీక్ష స్వాములకు జరిగే అన్నదాన కార్యక్రమానికి టెంట్ బహుకరించిన దాతలకు ఈ సందర్భంగా దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎవరైనా దాతలు, భక్తులు అయప్ప స్వాములకు అన్నదానం(బిక్ష) పెట్టాలనుకుంటే హనుమాన్ నగర్ దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులను సంప్రదించగలరని కమిటీ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు, అయ్యప్ప మాలధారులు, స్థానికులు, గుడి అయ్యగారు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ లను బీసీ–ఏలో చేర్చాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రపంచ మత్స్య కార్మికుల, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, తెలంగాణ శాసన మండలి ఉప సభాపతి పిలుపు మేరకు డోర్నకల్ మండలంలోని అమ్మపాలెం, డోర్నకల్, బూరుగుపాడు, గొల్ల చెర్ల, అందనాలపాడు, మన్నెగూడెం, రావి గూడెం, ములకలపల్లి గ్రామంలో ముదిరాజులు జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు నీలం కృష్ణ మాట్లాడుతూ ముదిరాజులను బీసీ–డీ నుంచి ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో హక్కులకు అనుగుణంగా మత్స్య సంపదను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం చేయూతనివ్వాలన్నారు. జిల్లా మత్స్యశాఖ ప్రమోటర్ చెన్నబోయిన ఆంజనేయులు మాట్లాడుతూ ఉచిత చేప పిల్లల బదులుగా సకాలంలో మత్స్యకారులకు నగదు రూపేణ సహాయం అందించాలని కోరారు. ప్రస్తుత సంవత్సరంలో చేపలు పట్టే సమయానికి చేప పిల్లల పంపిణీ ప్రభుత్వం చేయడం మత్స్యకారులకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి, కులగణన ఆధారంగా ముదిరాజులకు రాజకీయాల్లో, ప్రభుత్వ పథకాలలో సమాన అవకాశం కల్పించాలన్నారు. పగడాల వినయ్, మామిడి రామ్మూర్తి, గొడుగు వెంకన్న, చెన్నబోయిన సైదులు, బాదరబోయిన నాగన్న, తోట వీరయ్య, నాగ పిడుగు, రామనబోయిన వీరబాబు తదితరలు పాల్గోన్నారు.

# కేటీఆర్ ఏం మొఖం పెట్టుకొని వస్తావ్..

## ● సీపీఐ నేత అజయ్ సారథి రెడ్డి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలోని 27, 31వ వార్డుల సీపీఐ ఎన్నికల సన్నాక సమావేశం గురువారం 27వ వార్డులోని పాత ఏకశిలా స్కూల్ లో 27వ వార్డు సీపీఐ కన్వీనర్ వెలుగు శ్రావణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ మానుకోటకు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు ఇస్తామని గారడీ బూటకపు జీవోలు ఇచ్చి పైగా డబ్బులు వచ్చినట్టే పైలాన్ ను ఆవిష్కరించిన నాటి మంత్రి కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని మానుకోటకు వస్తావన్నారు. జీవోలు వచ్చాయని డబ్బులు వచ్చి మా వార్డులు అభివృద్ధి చెందుతాయని మానుకోటలోని పట్టణ ప్రజలు ఎదురు చూసినా కూడా నిధులు రాకపోగా మానుకోట పన్నుల రూపంలో కట్టిన జనరల్ ఫండ్ నుంచి కేసీఆర్ వస్తున్నాడని, కేటీఆర్ వస్తున్నాడని రూ.1.50 లక్షలు ఖర్చు చేశారన్నారు. వాటికి సమాధానం నాటి నేటి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చెప్పాలని అన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు కేటాయించి మానుకోట అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, 27వ వార్డు కన్వీనర్ వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, హర్షవర్ధన్, మాలోతు రవీందర్, వికాస్, బాలాజీ, జూలకంటి, వేణుడి రమేష్, నక్క నాగార్జున, గోపు దుర్గాప్రసాద్, కొలిశెట్టి పద్మ, గాజుల రాజు, జీడిమెట్ల శ్రీనాథ్, శారద, అక్కినపల్లి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమాలకు బియ్యం అందజేత




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఫారెస్ట్ ఆఫీస్ దగ్గర లోని సుస్మిత మార్కెటింగ్ ఆఫీసులో జిల్లాలోని ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల సంస్థలు, వృద్ధ ఆశ్రమాలకు బియ్యాన్ని సుస్మిత మార్కెటింగ్ యాజమాన్య దంపతులు ఎంఎస్ఎన్ మూర్తి, నాగరాణి అందజేశారు. జిల్లాలోని పది వివిధ సంస్థలకు దాదాపు ఒక్కొక్క సంస్థకు రెండు క్వింటాళ్ల (200) కిలోల బియ్యం బస్తాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.అనితా రెడ్డి, కేయూ పాలక మండలి సభ్యురాలు మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని మానసిక దివ్యాంగుల సంస్థలన్నీ, వృద్ధాశ్రమాలు నేడు ఒక వేదిక మీదకి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడం, కంపెనీ చైర్మన్ మూర్తి సతీమణి నాగరాణి పుట్టిన రోజు కావడం కూడా సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగుల సేవ దైవసేవ అని ప్రతి ఒక్కరూ ప్రేమతో వారికి తోచిన సహాయసహకారాలు అందించాలని కోరారు. అన్నదానం మహాదానం అని, ప్రతి ఒక్కరూ సుస్మిత మార్కెటింగ్ కంపెనీ లా ఇలా సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలు చేపట్టి స్ఫూర్తిగా నిలవాలని చైర్మన్ ఎంఎస్ఎన్ మూర్తిని, నాగరాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల నిర్వాహకులు, స్పందన స్కూలు సుచరిత రెడ్డి, లార్డ్ వృద్ధ ఆశ్రమం నరేష్, అతిథి స్కూల్ సుజాత, డాన్ బాస్కో శారద, మల్లికాంబ మనోవికాస కేంద్రం కోడం కళ్యాణ్, స్వధార్ ఆశ్రమం శైలజ, స్వయకృషి వృద్ధ ఆశ్రమం శుభ, అశుంత నిలయం సుజాత, వివిధ సంస్థలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్డి గాండ్ల వారిని బీసీలుగా గుర్తించొద్దు

### బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ కు బీసీ కులసంఘాల వినతి



**వరంగల్ వాయిస్, కాటారం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డి గాండ్ల వారిని బీసీలుగా గుర్తించవద్దని కాటారం డివిజన్ లోని బీసీ కులసంఘాల నేతలు తెలంగాణ వెనుకబడిన తరగతుల డేడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్గొనే అంశంలో డేడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో హనుమకొండ కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో అఖిల గాండ్ల సంక్షేమ సంఘం కాటారం డివిజన్ అధ్యక్షుడు నిడిగొండ మైనర్ బాబు మాట్లాడుతూ రెడ్డి గాండ్ల కులస్తులకు గతంలో జారీ చేసిన తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని బీసీలుగా గుర్తించరాదని, మా ప్రాంతంలో ఉన్న అన్ని బీసీ కులాలకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు ఆత్మకూరి స్వామి యాదవ్, సముద్రాల తిరుపతి, విజయగిరి సమ్మయ్య, ముక్కెర వినోద్ గౌడ్, వెన్నంపల్లి మహేష్ పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కాలేజీలు

### చర్యలు తీసుకోవాలంటూ డీవైఎఫ్ఐ డిమాండ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్ పరీక్ష ఫీజు పేరుతో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ ఫీజులను వసూలు చేస్తున్న హనుమకొండ నగరంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి గోపాల్ కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు కాలేజీలు ఫీజు మొత్తం చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుకుంటామని, లేకుంటే తీసుకోమని విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికే 80 శాతం ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులను మొత్తం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరైంది కాదని, విద్యా సంవత్సరానికి ముగింపుకు ఇంకా సమయం ఉన్న మొత్తం ఫీజులు కట్టాలని వేధించడం సరికాదన్నారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంకా పంట చేతికి రాలేదని, అమ్మిన పంటకు డబ్బులు రాకపోవడం వల్లే ఫీజులు చెల్లించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను అర్థం చేసుకోకుండానే ప్రైవేటు కాలేజీలు ధనార్జనే ధ్యేయంగా అవకాశాన్ని అదునుగా చేసుకొని ఫీజులు కట్టాలని వేధించడం మానుకోవాలని, పరీక్ష ఫీజు పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ, విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీ పై, చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

# విద్యార్థి దశలోనే సోషల్ స్కిల్ నేర్చుకోవాలి

◆ కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** "విద్యార్థిలో చదువుతో పాటు వలంటీర్ షిప్ ను అభివృద్ధి చేయాలి"అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన సెనెట్ హాల్ లో "ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం"లో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రోగ్రాం ఆఫీసర్లను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలోనే సోషల్ స్కిల్, లీడర్ షిప్ స్కిల్, వలంటీర్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. 21వ శతాబ్దపు విద్యార్థి టెక్నాలజీని ఎలా వినియోగించాలి, సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ తెలుసుకోవాలన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కావద్దన్నారు. ప్రాధాన్యత అంశాలైన విమెన్ సేఫ్టీ, డ్రగ్స్ పై అవగాహన, ట్రాఫిక్ అవగాహన, సైబర్ సెక్యూరిటీ ల పై వాలంటీర్ లకు శిక్షణ చేయాలి అన్నారు, విశ్వవిద్యాలయం లో ఉన్న "ఎంపానెల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ETI)" ను పునరుద్ధరిస్తామని తెలిపారు. గతంలో ఎన్నో జాతీయ స్థాయి అవార్డులు పొందిన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ముందు ముందు కూడా అదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. గౌరవ అతిథి రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలపై శ్రద్ధ వహించాలని తెలిపారు. వలంటీర్ గా ఎన్ని పని గంటలు వెచ్చిస్తున్నాడనేది ముఖ్యమని, సమయం వృధా కావద్దన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు గ్రహించాలని సూచించారు. శ్రమ దానానికి పరిమితులు ఉండవని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ నిధులు భారీగా తగ్గినట్టు, ఉన్నట్టువంటి గ్రాంట్ ను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. వలంటీర్ల నమోదు పెంచాలని, ప్రోగ్రాం ఆఫీసర్లు వారి యూనిట్ లు నిర్వహించిన కార్యక్రమాలను మై భారత్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు మాట్లాడుతూ కళాశాలల న్యాక్ గ్రేడింగ్ సాధించటంలో జాతీయ సేవా పథకం కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె ప్రతాప్ రెడ్డిని, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డిని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. డాక్టర్ శ్రీదేవి స్వాగతం పలుకగా, డాక్టర్ ప్రసన్న కుమార్ వందన సమర్పణ గావించారు.

# ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలని, ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళా ఆర్థిక సారికాతకు కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యుడు రేవూరు ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలో గల ప్రభుత్వ భవనాలను విహబ్ ఫౌండేషన్ సీఈవో సీతా పల్లెచోళ్ల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ద్వారా వారి కుటుంబం అభివృద్ధి చెందడమే కాక సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు వనరులను ఉపయోగించుకొని మహిళల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. మహిళా సంఘాలు తమ వ్యాపార సంస్థలను ఏర్పాటు చేయడానికి మరియు వ్యాపార అభివృద్ధికి సంబంధించిన ప్రోడక్ట్, డెవలప్ మెంట్, మార్కెటింగ్, ఫండింగ్ లాంటి వివిధ సౌకర్యాలను కల్పించడానికి త్వరలో పరకాలలో ప్రాజెక్టును ప్రారంభించబోతున్నామన్నారు. ప్రాజెక్టు ప్రారంభమయ్యాక మహిళా సంఘ సభ్యులకు అవసరమైన వ్యాపార అభివృద్ధికి సంబంధించిన సౌకర్యాలు సదుపాయాలు దొరుకుతాయని, వాటిని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. వీ హబ్ ఫౌండేషన్ సీఈఓ సితా పల్లెచోళ్ల మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగతంగా సామూహికంగా వ్యాపారాలను స్థాపించి వాటిని అభివృద్ధి చేసుకునేందుకు కావలసిన మద్దతును వి హబ్ ఫౌండేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహబ్ డైరెక్టర్ జావీద్ ఆక్తర్ షేక్, ఉష సబ్జా అసోసియేట్ డైరెక్టర్, గురు ప్రసన్న ప్రాజెక్ట్ మేనేజర్, సాయిరాం మచ్చ ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, సుధాకర్, శీను, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

◆ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ కు వచ్చిన బీసీ డేడికేషన్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్ రావును బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణ గౌడ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్రంలో అనేక ప్రభుత్వాలు మారినా, బీసీ సంఘాలు ఎన్నో నిరసనలు, ధర్నాలు చేసిన కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన పైన స్పందించ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కామారెడ్డి మీటింగ్ లో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఈ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి దిగ్విజయంగా పూర్తి చేస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని బీసీ కులాలు, అన్ని బీసీ సంఘాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ కులగణన పూర్తైన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం వారికి వాటా కేటాయించాలని కోరారు. ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లను తొలగించాలని, చట్టసభలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ కు వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కర్నె రవీందర్, సాగర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కొండా మురళి ఆత్మీయ పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డి పల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సీపతి చేరాలు అనారోగ్యం కారణంతో నిన్న మరణించడం జరిగింది. ఆ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు గురువారం కామారెడ్డి పల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి, వారి పార్థీవ దేహానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. తక్షణ సాయంగా రూ.25,000 ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి కొండా దంపతుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసానిచ్చారు.

# మేదరులకు రిజర్వేషన్ కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజకీయ, సామాజిక, విద్య, వైద్య పరంగా చాలా వెనుకబడి ప్రజా ప్రతినిధులుగా ఏ చిన్నా చితక పదవిని పొందకుండా బీసీ–ఏలో కొనసాగుతున్న మేదరులకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలని హనుమకొండ జిల్లా మేదరి సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ డెడికేటెడ్ కమిషన్ ముందు బహిరంగ విచారణకు హనుమకొండ జిల్లా మేదరి సంఘం సభ్యులు హాజరై విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహా దారులు మన్న భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షులు, చిలువేరు సురేందర్, కోరుట్ల రమేష్, జిల్లా సహాయ ప్రచార కార్యదర్శి ప్రతాపగిరి వెంకట రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ మత్స్యకారుల జెండా ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ ముదిరాజ్ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పర్వతగిరి మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా తీసుకొని పోయి ముదిరాజ్ గుండెల్లో చైతన్యం రేపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజు మహాసభల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చెక్ ముకి పోటీలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జన విజ్ఞాన వేదిక (జేవీవీ) సైన్స్ ఫెస్టివల్ లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి చెక్ ముఖి పోటీలు నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాలల్లో జరిగిన ఈ పరీక్ష పోటీలను మండల విద్యాశాఖధికారి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అప్పరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడానికి చెకుముకి పరీక్ష పోటీలు దోహదపడతాయన్నారు. జేవీవీ మండలాధ్యక్షుడు కొవిల రాజేశ్వర్, కన్వీనర్ మంజులత, వసంత పర్యవేక్షణలో జరిగిన పరీక్ష పోటీలకు అగ్రస్ పాఠశాల హెచ్ఎం హెలెన రాణి, కృష్ణ భాను టీచర్లు సాహెబ్ అలీ, హమీద్, దమయంతి, శ్రీనివాస్, బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

## ఆర్డీవో కే.నారాయణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నడికూడ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం పరకాల ఆర్డీవో కన్నం నారాయణ సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా ప్రగతిపైన ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక అవసరాలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. దాతల సహాయంతో కూడా ఈ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పదవ తరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థి సఖియాను స్థానిక తహసీల్దార్ నాగరాజు దత్తత తీసుకున్న విషయాన్ని తెలుసుకొని తహసీల్దార్ నాగరాజుని ఆర్డీఓ అభినందించారు. ఈ సందర్భంగా నడికూడ మండల తహసీల్దార్ డి.నాగరాజు మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన లైబ్రరీ, ల్యాబ్ కు సంబంధించిన సౌకర్యాలను కల్పించడంలో తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడికూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో కే హనుమంతరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృపారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జయ, శివ చేతన్, శ్రీనివాస్ రెడ్డి, శ్రావణ్ కుమార్, తిరుపతి, సుభాని, శివకుమార్, శారద, జ్యోత్స్న, రాజు, కుమారస్వామి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతులు

## జస్టిస్ చంద్రకుమార్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వ్యవసాయ రంగంలో అవిశ్రాంతంగా పనిచేస్తూ పంటలు పండిస్తున్న రైతాంగానికి గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని అబ్బనీకుంటలో ఉన్న తెలంగాణ రైతు సంఘం భవనంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయని, కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ప్రభుత్వం, పంటలు కొనుగోలు చేయనందు వల్ల రైతులు వ్యాపారులకు అమ్ముకోవడంతో నష్టాల పాలవుతున్నారని, ప్రభుత్వాలే కొనుగోలు చేసి వ్యాపారులకు అమ్మాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ రైతులు, అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండే ఇన్సూరెన్స్ పాలసీలు లేవని కౌలు రైతుల పరిస్థితి మరింత ఆందోళనకారంగా ఉందన్నారు. పరిశ్రమల పేరుతో రైతుల భూములను లాక్కోవడం సరికాదన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో, దేశం అభివృద్ధి చెంది ప్రాజెక్టుల నిర్మాణాలు హైబ్రిడ్ విత్తనాలు వాడడంతో పాటు రసాయనిక ఎరువులు ఉపయోగం వల్ల పంట అధిక దిగుబడి వచ్చిన రైతులకు మేలు జరగడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు, రైతు సంఘం నాయకులు ఓదెల రాజయ్య, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంభ బాబురావు, సోమ రామ్మూర్తి, హంసల్ రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా పెద్ది ఆంజనేయులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఉమ్మడి జిల్లా భవనంలో ఎన్నికల అధికారి, రాష్ట్ర కోశాధికారి ఉపేందర్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల్లో పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిటెడ్ అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర సంఘం బాధ్యుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అలాగే, తనను ఉపాధ్యక్ష పదవికి సహకరించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్ రావుకు రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది

- ఎర్ర జెండా వైపు చూస్తున్న ప్రపంచ యువత
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని, కమ్యూనిజమే ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం హసన్ పర్తి మండల సీపీఐ సమితి సమావేశం నేదునూరి రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ కనుగొన్నాడని, ఆ సిద్ధాంతమే ప్రపంచంలో దోపిడీ నుంచి మానవాళి విముక్తికి మార్గం చూపిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నదని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో ప్రపంచ యువత ప్రత్యామ్నాయంగా ఎర్ర జెండా వైపు చూస్తున్నదని తెలిపారు. ఇప్పటికే క్యూబా, వియత్నం, చైనా తదితర దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా ఉండి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని, ఇటీవల అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి క్లాడియ డీల క్రూజ్ కు ఒక లక్షా ఏడువేల ఓట్లు లభించాయని తెలిపారు. అలాగే, మన పొరుగు దేశాలైన నేపాల్ లో, శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు డిసెంబర్ 26 కు పూర్తి చేసుకుంటున్నదని అని తెలిపారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణలో వీరోచిత తెలంగాణ పోరాటాలు నడిపించిందని, హసన్ పర్తి ప్రాంతంలో ప్రజల కోసం ఎర్ర జెండా నీడన పోరాడిన పాడి మల్లారెడ్డి, తోకల కొమురారెడ్డి, పాడి చంద్రారెడ్డి, గంగిళ్ల లింగారెడ్డి, రేణుకుంట్ల ఐలయ్య, నేదునూరి చెన్నయ్య లాంటి వీరులు అమరులై ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని అన్నారు. అలాంటి అమరవీరులు అందించిన స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకు పోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్లాపూర్ సీపీఐ కార్యాలయానికి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక అంగడి స్థలాన్ని, కబ్జాకు గురవుతున్న చేపల హౌస్ ఏరియాను సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గిరిజన రాష్ట్ర కార్యదర్శి మాలోత్ శంకర్, కాజీపేట మండల సీపీఐ కార్యదర్శి మునిగాల భిక్షపతి, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, సీపీఐ హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు దోమ రాకేష్, రేణిగుంట్ల రాజయ్య, రేణుకుంట్ల దుర్గా ప్రసాద్, ఎల్లాపూర్ శాఖ కార్యదర్శి షేక్ బాబు, కొత్తగట్టు శ్యాంసుందర్, నూతనంగా గురువారం పార్టీలో చేరిన నేదునూరి సాంబయ్యతో సహా వంగపాడు గ్రామం నుంచి మధున జ్యోతి, మడిపల్లి నుంచి సాంబరాజు యాదవ్, ఎల్లాపూర్ శాఖ నుంచి బుచ్చిరెడ్డి, వద్దూరి సుధాకర్, వెంకటేశ్వర్లు, ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ పాడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 75 ఏండ్ల స్వాతంత్ర భారతంలో మొట్టమొదటి సారి చేపడుతున్న సమగ్ర బీసీ జనగణన చట్టం ముందు నిలిచేవిధంగా ఉండాలని బీసీ సంఘాలు నేతలు ఆకాంక్షించారు. ఆ దిశగా బీసీ సమాజ సమస్యలను గుర్తించి, సమగ్ర కుల జనగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి తెలంగాణలో కుల జనగణన జరిపి తద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం చేసే ప్రయత్నాలకు బీసీ సమాజం పక్షాన ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతికుమార్ లు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, 35 డిమాండ్లతో కూడిన తన నివేదికను బీసీ డెడికేషన్ కమిషన్ కు అందించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బీసీ డెడికేషన్ కమిషన్ బహిరంగ విచారణలో పాల్గొని కమిషన్ ఛైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు కు నివేదికను అందించి ప్రసంగించారు. సమగ్ర కుల జనగణన జరపాలని ఆ జనగణన చట్టం ముందు నిలబడే విధంగా సమగ్రంగా ఉండాలని, కుల జనగణలో అతి ముఖ్యమైన సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని, బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను స్పష్టంగా లెక్క వేయాలని, స్త్రీ, పురుషుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి గురించి లెక్కలు తేయాలని, విద్యార్హతలు, వృత్తి, స్వంత ఇల్లు, ఆస్తులు, మంచినీటి సౌకర్యాలు, వంట గ్యాస్ తదితర సౌకర్యాల అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి నాయకులు గొల్లపల్లి వీరాస్వామి, ఓబీసీ జాక్ నాయకులు నారాయణగిరి రాజు, మేరు సంఘం నాయకులు వెంకట్రాజ్యం, యాదవ సంఘం నాయకులు సిద్ధిరాజ్ యాదవ్, పెరిక సంఘం నాయకులు వద్దే రవీందర్, వివిధ సంఘాల నాయకులు దేవిడ్, రమేష్, నయిమొద్దీన్, కత్తుల కవిత, వీరభద్రయ్య, ముదురుకోల విజయ్ కుమార్, అలకుంట్ల రాజమ్మ పాల్గొన్నారు.

# సర్వే డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా చేపట్టాలి

- ఆపరేటర్లకు కలెక్టర్ దిశానిర్దేశం



**వరంగల్ వాయిస్, ములుగు :** డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా నమోదును ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా పక్కాగా చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల భవనంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ తీరును జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇవ్వడం జరిగినదని, డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు గా 100 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించారని సర్వే వేగవంతంగా పూర్తి జరిగిందని తెలిపారు. ఎంపీడీ రహీం, ఈడీఎం దేవేందర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.






# రామ్ సరసన మిస్టర్ బచ్చన్ హీరోయిన్

నటుడు రామ్ పోతినేని హీరోగా కొత్త సినిమా పట్టాలెక్కింది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విజయాన్ని అందుకున్న మహేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ఇందులో చిత్రబృందం పాల్గొన్నారు. దర్శకులు హను రాఘవపూడి, గోపీచంద్ మలినేని, శివ నిర్వాణతోపాటు సినీ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని టీమ్‌కు అభినందనలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు హను రాఘవపూడి క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'డబుల్ ఇస్మార్ట్' తర్వాత రామ్ నటిస్తోన్న చిత్రమిదే. రామ్ 22వ సినిమాగా ఇది సిద్ధమవుతోంది. ఖీజూనీ 22గా ప్రచారంలో ఉంది. హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. రామ్ విభిన్నమైన లుక్‌లో కనిపిస్తారని వార్తలు వస్తున్నాయి. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్‌లు దీన్ని నిర్మిస్తున్నారు. 'మిస్టర్ బచ్చన్'తో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే.

# పుష్ప-2 రిలీజ్ వేళ..

## మళ్లీ తెరపైకి గరికపాటి కామెంట్స్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పుష్ప 2' సినిమా రిలీజ్ కి దగ్గరపడుతున్న వేళా సోషల్ మీడియాలో కొత్త రచ్చ మొదలైంది. గతంలో ప్రముఖ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు 'పుష్ప' సినిమాపై చేసిన వ్యాఖ్యలు మళ్ళీ ట్రెండ్ అవుతున్నాయి. 2021లో 'పుష్ప' సినిమా రిలీజ్ అయినా టైమ్‌లో ఇలాంటి సినిమాలు సమాజానికి హానికరం అంటూ గరికపాటి నరసింహారావు వ్యాఖ్యలు చేసిన విషయం తెల్సిందే. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వ్యక్తిని హీరోగా చూపించడం ఎంతవరకూ సమంజసం. సినిమా మొత్తం స్మగ్లింగ్ చూపించి. చివరలో మంచిగా చూపిస్తాం తదుపరి భాగం వరకూ వేచి చూడండి అంటారు. ఇది ఎంతవరకూ న్యాయం. ఈలోపు సమాజం చెడిపోవాలా స్మగ్లింగ్ చేసే వ్యక్తి 'తగ్గేదే లే' అంటాడా. ఇప్పుడు అదొక ఉపనిషత్ సూక్తి అయిపోయింది. ఈ చిత్ర హీరో దర్శకుడు తనకు సమాధానం చెప్తే కడిగేస్తా. ఒక కుర్రాడు ఎదుటివ్యక్తిని కొట్టి.. 'తగ్గేదే లే' అంటున్నాడు. ఈ డైలాగ్ వల్ల సమాజంలో నేరాలు పెరిగిపోతున్నాయి. 'తగ్గేదే లే' అనేది హరిశ్చంద్రుడు, శ్రీరాముడు వంటి వారు వాడాలి. అంతేకానీ స్మగ్లర్లు కాదంటూ' ఆయన మండిపడ్డారు. అయితే అప్పుడు ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యి పెద్ద దుమారమే రేపాయి. గరికపాటికి సినిమా ఫ్యాన్స్‌తో సహా పలువురు సెలబ్రిటీలు కౌంటరు ఇచ్చారు. మళ్ళీ 'పుష్ప 2' రిలీజ్ నేపథ్యంలో ఈ వీడియో రిపీటెడ్ గా షేర్ అవుతోంది.

# కొదమసింహంలో లేనిది.. మగధీరలో చూపించా



### భావోద్వేగ సన్నివేశాలపై రాజమౌళి

భావోద్వేగ సన్నివేశాలు మలిచి ప్రేక్షకుడి మదిలో చెరగని ముద్ర వేయడంలో దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సిద్ధహస్తుడు. అందుకే ఆయన తీసే సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఇక ఎమోషనల్ సన్నివేశాలు, హీరో ఎలివేషన్ సీన్స్ తీయడంలో ఆయనది ప్ఓరత్యేకమైన శైలి. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'మగధీర' రామ్‌చరణ్ కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకుంది. అందులోని ఓ సన్నివేశం భావోద్వేగభరితంగా రావడానికి చిరంజీవి నటించిన 'కొదమ సింహం' చిత్రమే కారణమని రాజమౌళి ఓ సందర్భంలో పంచుకున్నారు. చిరంజీవి 'కొదమసింహం' మూవీలో రౌడీలు చిరును పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి వెళ్లిపోగా...అక్కడే ఉన్న ఆయన గుర్రం ఆయన నోటికి తాడు అందించి కాపాడుతుంది. అయితే, ఆ కష్టంలో నుంచి బయటకు వచ్చిన ఆయనకు, గుర్రానికీ అనుబంధం లేదని రాజమౌళి భావించారు. అందుకే 'మగధీర'లో ఇసుక ఊబిలో కూరుపోయిన చరణ్ బయటకు వచ్చిన తర్వాత తన గుర్రాన్ని కౌగలించుకుంటాడు. ఒక స్నేహితుడిలా చూస్తూ దానితో కృతజ్ఞత భావంతో మాట్లాడతాడు. అలా నా సినిమాల్లో బలమైన సన్నివేశాలు ప్రేక్షకుల ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది రాసినవే ఉంటాయి' అని రాజమౌళి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాజమౌళి ఎంబి 29 పనుల్లో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ మహేశ్‌బాబు కనిపించని సరికొత్త అవతారంపై దర్శనమివ్వనున్నారు.





# నెంబర్ తెచ్చిన కష్టాలు

### అమరన్ మూవీ నిర్మాతకు సెల్ నంబర్ విద్యార్థి లీగల్ నోటీసులు

అపరిచితుల నుండి ఫోన్‌కాల్స్ వస్తుండటంతో చెన్నైకి చెందిన వి.వి వాగీశన్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి అమరన్ నిర్మాతలకు లీగల్ నోటీసులు పంపాడు. దీనిక్కారణం సినిమాలోని ఓ సీన్ కావడం గమనార్హం. ఇంతకీ విషయమేంటంటే అమరన్‌లో కొన్ని సెకన్ల పాటు సాగే సన్నివేశంలో సాయి పల్లవి తన ఫోన్ నంబర్ వ్రాసిన నలిగిన కాగితాన్ని విసురుతుంది. అయితే ఈ సీన్‌తోనే విద్యార్థికి కష్టాలు మొదలయ్యాయి. ఆ ఫోన్ నంబర్‌లో ఒక అంకె స్పష్టంగా కనిపించకపోయినప్పటికీ.. ఆ నంబర్ మాత్రం సదరు విద్యార్థి ఫోన్ నంబర్‌గా సిల్వర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో చాలా మంది సాయిపల్లవితో మాట్లాడొచ్చనే ప్రయత్నంలో ఆ నంబర్‌కు ఫోన్ చేశారు. అయితే రిపీటెడ్‌గా కాల్స్ వస్తుండటంతో వాగీశన్ తన ఫోన్‌ను మ్యూట్ చేశాడు. ఆ తర్వాత కొన్ని వాయిస్ మెసేజ్‌లు విన్న తర్వాత తన మొబైల్ నంబర్ అమరన్ స్క్రీన్‌పై చూపించినట్టు నిర్ధారణకు వచ్చాడు.ఫోన్ కాల్స్ తనకు తీరని కష్టాలు తెచ్చిపెట్టడమే కాకుండా మానసిక వేదనకు గురి చేస్తుండటంతో.. దీనికి పరిష్కారం చూపించాలని కోరుతూ వాగీశన్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియస్వామి, హీరో శివకార్తికేయన్ సోషల్ మీడియాలో ట్యాగ్ చేశాడు. అయితే దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో తనకు రూ. 1 కోటి నష్టపరిహారంగా ఇవ్వాలని పరువు నష్టం దావా వేశాడు. తన ఆధార్, బ్యాంక్ కార్డ్స్‌తో ఇతర అకడమిక్ ప్లాట్‌ఫామ్స్‌తో ఫోన్ నంబర్ లింక్ అయి ఉన్న నేపథ్యంలో.. తన ఫోన్ నంబర్ మార్చబోనని వాగీశన్ చెబుతున్నాడు. మరి వాగీశన్ దావాపై అమరన్ టీం ఎలా స్పందిస్తుందో చూడాలి.



8

WARANGALVOICE

www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, నవంబర్ 21, 2024

# మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై కేసు

- సుబేదారి పీఎస్ లో భూకబ్జా కేసు నమోదు
- 500 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు ఆరోపణలు
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై భూకబ్జా వ్యవహారంలో హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఆయనపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని న్యూ శాయంపేట వినాయకనగర్ లోని దుర్గాదేవి కాలనీలో సర్వే నెంబర్ 186లోని 500 గజాల స్థలాన్ని శంకర్ నాయక్ కబ్జా చేసేందుకు యత్నించి దాడి చేయించినట్లు స్థలం యాజమానూలు రుద్రోజు పద్మావతి–సుగ్రీవచారి లు శంకర్ నాయక్ పై సుబేదారి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో ఈ నెల 20న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ స్థలానికి చెందిన యజమానులైన రుద్రోజు పద్మావతి –సుగ్రీవచారి గురువారం స్థలం పరిధిలో మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి పెంటయ్య చారి 1985 సంవత్సరంలో మారం వీరయ్య దగ్గర 497 గజాల భూమిని కొనుగోలు చేశాడని, తమ పెళ్లికి 248 గజాల భూమిని 2015లో పసుపు కుంకుమల మీద మాకు ఇచ్చారన్నారు. 2023 సంవత్సరంలో మేము ఇల్లు కట్టుకోవడానికి జీడబ్ల్యూఎంసీ నుంచి అనుమతి తీసుకున్నామని తెలిపారు. మా భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా నిర్మించుకుని అట్టి స్థలంలో రెడీమేడ్ కంటైనర్ ఇల్లును ఏర్పరుచుకున్నామని, కరెంట్ మీటర్ కూడా తీసుకున్నామన్నారు. మేము అందులో ఉండుటకు ఇంటి సామాగ్రిని, ఇంటికి సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. మా ఇంటిని చూసుకొనుటకు ఈ నెల 16న సాయంత్రం సుమారు 06.30 గంటల సమయాన నేను, నా భర్త సుగ్రీవాచారి, మా చిన్న కుమారుడైన దత్తరాజన్ లము కలిసి మా ఇంటి వద్దకు వెళ్లగా అక్కడ మా ఇంటి ప్రహారి గోడ ఒక వైపు కూలగొట్టి ఉందన్నారు. అందులో ఒక ఆడ మనిషి మా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి అందులో ఉందని తెలిపారు. మీరు ఎవరు అని మేము అడగగా ఈ ఇల్లు మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఇల్లు అని ఇందులో అతనే మమ్మల్ని ఉండమన్నారని చెప్పి కొంత మందిని పిలువగా మా వద్దకు వచ్చి మా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ఈ భూమి మా శంకర్ నాయక్ బాబాయ్ దని మీరు వెంటనే ఇక్కడికి ఎందుకు వచ్చారని మా అందరి పై దాడి చేసి మమ్మల్ని కొట్టి దౌర్జన్యంగా మా వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను సామ్ సాంగ్ గెలాక్సీ ఎస్22 అల్ట్రా, రెడ్ మి 9 పవర్ ఫోన్ లను లాక్కొని చీర పట్టి లాగి చింపి అవమానపరిచారని తెలిపారు. మీరు ఈ భూమి వదిలిపెట్టి ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని, లేకుంటే మిమ్మల్ని చంపుతామని బెదిరించి అక్కడి నుంచి పంపించి మా భూమిని లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. వారు దౌర్జన్యంగా మా వద్ద నుంచి లాక్కున సెల్ ఫోన్ల విలువ సుమారు ఒక లక్ష ఇరువై వేల రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. మేము ప్రాణ భయంతో ఆ రోజు వెళ్లి మళ్లీ మరుసటి రోజు నా భర్త సుగ్రీవ చారి, తన స్నేహితులతో కలిసి అక్కడకు వెళ్లగా పై వారు అందరు కలిసి మా భూమిలో ఉన్న కంటైనర్ ఇంటిని, అందులోని వస్తువులను దొంగిలించుకొని వెళ్లారని తెలిపారు. ఆ కంటైనర్ అందులో ఉన్న వస్తువుల విలువ సుమారు మూడు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. గతంలో కూడా ఈ ఇంటి విషయంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మనుషులు కొంతమంది కలిసి మాపై దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ విషయంపై సుబేదారి పోలీస్ స్టేషన్ లో శంకర్ నాయక్ పై ఫిర్యాదు చేశామని పోలీసులు ఈ నెల 20న అతనిపై కేసు నమోదు చేయారని తెలిపారు. మాకు వారి నుంచి ప్రాణ భయముందని కాబట్టి, అధికారులు, పోలీసులు దర్యాప్తు చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరారు.




# ఏసీబీకి చిక్కిన అధికారిణి

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ డ్రాఫ్ట్ మెన్
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లంచం రూ.20 వేలు తీసుకుంటూ ఏసీబీకి సీనియర్ డ్రాఫ్ట్ మెన్ అధికారిణి ఒకరు గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వరంగల్ కు చెందిన కార్తీక్ అనే వ్యక్తి స్టేషన్ గుండ్రతిమడుగు గ్రామ శివారులోని భూమిని కొనుగోలు చేసేందుకు ఆభూమికి సంబంధించిన టీపన్ కోసం అక్టోబర్ 28న దరఖాస్తు చేసుకున్నాడు. తొలుత చలానా కట్టాలని కార్యాలయంలోని సీనియర్ డ్రాఫ్ట్ మెన్ కె.జ్యోతి క్షేమ భాయి రూ.5వేలు తీసుకుంది. నవంబర్ 12 వరకు టీపన్ వివరాలు ఇవ్వలేదు. రూ. 20 వేలు ఇస్తే వివరాలు ఇస్తానని చెప్పడంతో, లంచం ఇవ్వడం ఇష్టం లేని కార్తీక్ వరంగల్ లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం నాడు కార్యాలయంలో కార్తీక్ రూ. 20 వేలు ముట్ట చెబుతుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ అధికారులు కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఏసీబీ డిఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ జ్యోతిని శుక్రవారం నాడు వరంగల్ లోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఎవరైనా లంచం కోసం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో సీఐలు ఎల్.రాజు, ఎస్ రాజు, సిబ్బంది సాంబయ్య, ఏసీబీ, డీఎస్పీ పాల్గొన్నారు.

# పోలీసులు ప్రజా సేవకు అంకితం కావాలి

**వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోలీసులు శాంతి భద్రతల పరిరక్షిస్తూ, పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించే దిశగా నిరంతరం ప్రజల సేవకు అంకితం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 246 మంది స్టైఫండరీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల (సివిల్) పాసింగ్ అవుట్ పరేడ్‌ను(దీక్షాంత్ పరేడ్) గురువారం మడికొండలోని సిటి పోలీస్ శిక్షాణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్యఅతిధిగా హజరై ముందుగా ట్రైనీ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధి నిర్వహణలో వివక్ష చూపమని, తమ సేవలతో దేశ ప్రతిష్టలను పెంచుతామని శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ కానిస్టేబుళ్ల చేత సీటీసీ ప్రిన్సిపాల్ రవి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది పోలీసులు మాత్రమేనని, నేటి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల గురువారం నుంచి పోలీస్ శాఖలో పూర్తి బాధ్యతలు చేపట్టేందుకు సిద్దమయ్యారని తెలిపారు. అంతకు ముందు శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ట్రైనీ కానిస్టేబుళ్లకు గత ఫిబ్రవరి మాసంలో ప్రారంభమైన తొమ్మిది నెలల పోలీస్ శిక్షణ సమయంలో ట్రైనీ కానిస్టేబుళ్లకు పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, పోలీస్ చట్టాలు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్ ఈ అవుట్‌డోర్స్ ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్‌లు, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్, ఫస్ట్ ఎయిడ్, పోలీస్ అప్లికేషన్ల వినియోగం మొదలైన అంశాల్లో ట్రైనీ కానిస్టేబుళ్లకు శిక్షణ అందజేయడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణలో ప్రతిభ కనబరిచిన నాగరాజు, రవి, శశిధర్ గౌడ్‌లకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ రమణబాబు, ఏసీపీలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐ ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్పర్జన్‌రాజ్, ఇన్ స్పెక్టర్లు రవికుమార్, మంగీలాల్, కిషన్‌తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ఇన్‌డోర్, ఆవుట్ డోర్ సిబ్బందితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రామప్పలో కేంద్ర సహాయ మంత్రి

- దేవాలయంలో రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన పూజారులు

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** రామప్ప దేవాలయాన్ని గురువారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతిబాయ్ బంబానియా సందర్శించారు. వెంకటపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం సందర్శనకు విచ్చేసిన ఆమెకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రామప్ప ఆలయ ప్రాంగణం లో పోలీస్ ల గౌరవ వందనం కేంద్ర మంత్రి స్వీకరించారు. కేంద్ర మంత్రి కి దేవాలయ వేద పండితులు సంప్రదాయ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి రుద్రేశ్వరుడినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు కేంద్ర మంత్రికి పట్టు వస్త్రాలతో సత్కరించి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. రామప్ప దేవాలయ ప్రత్యేకత అయినటువంటి నీటిపై తేలియాడే ఇటుక గురించి, ఆలయ చరిత్ర, శిల్ప సంపద, విశిష్టతపై ఆలయ గైడ్ కూలంకషంగా కేంద్ర మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com